ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన వీడ్కోలు పార్టీ ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. తొమ్మిది, ఇంటర్ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బండెనక బండి.. పత్తి అమ్మేందుకండి..!



చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని పత్తి మిల్లుల ఎదుట పత్తిని అమ్మేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. మంగళవారం సుమారు కిలోమీటరు వరకు రోడ్డుపై పత్తి వాహనాలు నిలిచిపోయాయి. పంటను అమ్మడానికి నానా అవస్థలు పడ్డారు.

మొక్కజొన్న పంట ధ్వంసం



దండేపల్లి: మండలంలోని అల్లీపూర్ శివారులో ముత్తినేని రాజమణికి చెందిన మొక్కజొన్న పంటను మంగళవారం తెల్లవారుజామున అడవి పందులు ధ్వంసం చేశాయి. అటవీశాఖ అధికారులు స్పందించి నష్టపోయిన పంటకు తగిన పరిహారం ఇప్పించాలని బాధిత రైతు వేడుకున్నారు.

క్లుప్తంగా

పాఠశాలల్లో డీఈవో తనిఖీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక హరిజనవాడ, రాళ్లపేట్ ప్రభుత్వ పాఠశాలలను డీఈవో యాదయ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు ప్రశ్నలు వేయగా పలువురు విద్యార్థులు తక్కువ సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయురాలు సుమతి పాల్గొన్నారు. హరిజనవాడ, రాళ్లపేట్ పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సునిత్‌కుమార్ మొక్కలు నాటారు. సీజీఎస్టీ సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, అజిత్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ యోగేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ అభ్యర్థులను గెలిపించాలి'



మాట్లాడుతున్న నరెడ్ల శ్రీనివాస్

నస్పూర్: బీసీ వాదం బలపడాలంటే పట్టుభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులనే గెలిపించుకోవాలని బీసీ సమాజ్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మంగళవారం మాట్లాడారు. బరిలో నిలిచిన బీసీ అభ్యర్థులైన ప్రసన్న హరికృష్ణ, మల్క కొమురయ్యలకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. శాసనసభలో బీసీల వాదాన్ని బలంగా వినిపించాలంటే బీసీ అభ్యర్థుల గెలుపు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంఘం సురేష్, నాయకులు ఈదునూరి రమేష్, బొలిశెట్టి లక్ష్మణ్, గొర్రె తిరుపతి యాదవ్, ఇనవంక నాగలక్ష్మి, మంచెర్ల సదానందం, తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు మహేశ్వర్మ, తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా ముందుకు సాగాలి

నస్పూర్: పట్టభద్రుల ఎన్నికల్లో బీసీలు ఐక్యంగా ముందుకు సాగి కలిసికట్టుగా బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని బీసీ ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. ప్రసన్నహరికృష్ణకు మద్దతునిచ్చి ఆయనకు ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ చుంచు రాజ్‌కిరణ్, అడ్వకేట్ అండ్ సైకాలజిస్టు వేణుకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వెంకటేశ్వర్లు

దండేపల్లి: ఆర్యవైశ్యులు వ్యాపారాలకే పరిమితం కాకుండా రాజకీయంగా, విద్యాపరంగా ఎదిగి అన్ని రంగాల్లో రాణించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతయ్య అన్నారు. మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మేదరిపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మండల కమిటీ నూతన అధ్యక్షుడు ఎలుగూరి వేణు, ప్రధాన కార్యదర్శి అడ్డగూరి వెంకటేశం, కోశాధికారి గోలి రవీందర్, యూత్ అధ్యక్ష, కార్యదర్శులు శివరామకృష్ణ, మధు, కోశాధికారి కిషన్, మహిళ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉదయ, కావ్య, కోశాధికారి సుధారాణి మండలం లోని వివిధ గ్రామాల ఆర్యవైశ్య కులస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి పరామర్శ



పరామర్శిస్తున్న డీపీవో, ఎంపీవోలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెన్నూర్ మండలం లింగంపల్లి పంచాయతీ కార్యదర్శి నయీమోద్దీన్‌ను డీపీవో వెంకటేశ్వర్‌రావు మంగళవారం పరామర్శించారు. డీపీవోతో పాటు జిల్లాలోని డీఎల్‌పీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు సేకరించిన రూ.1.66లక్షలు సాయంగా అందజేశారు. ఎంపీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బాపు, జన్నారం ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమర్‌షరీఫ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు పూదరి నరేందర్, ప్రధాన కార్యదర్శి లకావత్ శ్రీనివాస్‌నాయక్, అసోసియేట్ అధ్యక్షులు నాగరాజు, శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సుమన్, కార్యవర్గ సభ్యులు మధూకర్, జంగు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లిరూరల్: రానున్న ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్‌లు అన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయానికి నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. మహిళలు కోలాటాలు ఆకట్టుకున్నాయి.

భక్తులకు అన్ని రకాల వసతులు కల్పించాలి

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. వినోద్ దంపతులు పట్టు వస్త్రాలతో ఆలయానికి చేరుకోగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం జాతర పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి, పార్టీ మండల అధ్యక్షుడు సింగతి సత్తయ్య, నాయకులు పాల్గొన్నారు.

'నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడా...?'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మంచిర్యాల నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారసభలో చెప్పారని, ఎక్కడ అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 70ఏళ్ల నుంచి శ్మశానవాటిక కాన్సెప్ట్ మంచిర్యాలలో లేదని, గోదావరి ఒడ్డున ఉండడంతో అక్కడే అంత్యక్రియలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత సీఎంగా కేసీఆర్ అన్ని ఊర్లకు వైకుంఠధామాలు ఉండాలని వాటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలోని 23ఎకరాల భూదాన్ భూమిని తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కబ్జా కాకుండా కాపాడి, ఎంసీహెచ్‌ను నిర్మించగా, దాని సమీపంలోనే వైకుంఠధామం నిర్మించారని అన్నారు. ఏటా ఈ ప్రాంతానికి వరద నీరు వస్తుందని, అందుకే మరోచోట శ్మశాన వాటికను నిర్మించేందుకు తాము సిద్ధం చేస్తే, దానిని అడ్డుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు నిర్మించిన వైకుంఠధామం ఎంసీహెచ్‌కు దగ్గరగా, రోడ్డు పక్కనే ఉందని, రూ. 4.5కోట్లకు టెండర్ పిలిచి, రూ.12కోట్లు ఎలా ఖర్చు చేశారని ప్రశ్నించారు. మంచిర్యాల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంలో ఉండగా, దానిని కూల్చి ప్రజాధనాన్ని వృథా చేశారని, మార్కెట్‌లో వసేవే పెడితే సరిపోయేదని, అనవసరంగా వెయ్యి దుకాణాలను సర్వనాశనం చేశారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతారనే సీఎం సభను ఆఘమేఘాల మీద ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, అంకం నరేశ్, బేర సత్యనారాయణ, పెంట ప్రదీప్ నాయకులు పాల్గొన్నారు.

శాంతిఖని గని విస్తరణ కోసమే పునఃధ్రువీకరణ

- మార్చి 6న ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న మందమర్రి ఏరియా జీఎం దేవేందర్

బెల్లంపల్లి: శాంతిఖని భూగర్భగని విస్తరణలో భాగంగానే పునఃధ్రువీకరణ కోసం మార్చి 6న ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని సింగరేణి కాలరీస్ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జీఎం) జి.దేవేందర్ తెలిపారు. బెల్లంపల్లి శాంతిఖని గ్రూప్ ఆఫ్ మైన్స్‌ఏజెంట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిఖని గనిని ఓపెన్ కాస్ట్ (ఓసీపీ) చేయబోతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు. అలాంటి అవకాశం శాంతిఖని గనికి ఏకోశాన లేదని కొట్టిపారేశారు. జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని కోరారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ 2018 ఏప్రిల్ 6న జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం పర్యావరణ అనుమతులు పొందడం కోసం వెలువరించిన మార్గదర్శకాల నియమావళిలో భాగంగా పునఃధ్రువీకరణకు ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని నిశ్చయించినట్లు తెలిపారు. మార్చి 6న శాంతిఖని పాత మైన్ కార్యాలయం సమీపంలో ఉదయం 11గంటలకు అభిప్రాయ సేకరణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. శాంతిఖని గనితో బెల్లంపల్లి భవిష్యత్ ఆధారపడి ఉందని, భూగర్భ గని విస్తరణ కోసం గ్రామీణులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఓటు జీఎం విజయప్రసాద్, ఎస్‌కే గ్రూప్ ఏజెంట్ ఖాదిర్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, పర్యావరణ సెల్ అధికారి వెంకటరెడ్డి, ఎస్ఎస్‌ఓ రవి, శాంతిఖని సంక్షేమ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

వీడ్కోలు సందడి..!



మాట్లాడుతున్న ఎర్ర చంద్రశేఖర్

జన్నారం: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన చదువులతోనే సత్ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థులు మీ తల్లిదండ్రులు ఎంతో ఆశతో మిమ్ములను చదివిస్తున్నారని, మీ పై పెట్టుకున్న ఆశలు అడియాశలు చేయకుండా మంచి చదువులు చదువుకోవాలని సూచించారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కరిమల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, రాఘవేంద్ర లిటిల్‌హార్ట్స్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జయరాణి పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన్, డీన్ హేమలత షిండే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సమస్యలు పరిష్కరించాలి



జక్కారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్‌అండ్‌పీసీ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలని బీఎంఎస్ నాయకులు అధికారులను కోరారు. ఆ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరాంపూర్‌లోని ఏరియా సెక్యూరిటీ కార్యాలయంలో సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డిని కలిసి నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ట్రెయినీ ఎస్సైలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుగుణాకర్

నస్పూర్: ట్రెనింగ్‌లో భాగంగా సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సివిల్ ట్రెయినీ ఎస్సైలకు ఎస్సై సుగుణాకర్ స్టేషన్‌లో విధి నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 25మంది ట్రెయినీ సివిల్ ఎస్సైలు మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు రాగా వారికి రికార్డులు ఎలా మెయింటేన్ చేయాలి, ఫంక్షనల్ వర్టికల్స్, రిసెప్షన్ వర్టికల్, అడ్మిన్ వర్టికల్, స్టేషన్ రైటర్ వర్టికల్, అడ్మిన్ వర్టికల్ ఎస్‌హెచ్‌వో వర్టికల్ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర కార్యదర్శి

చెన్నూర్: ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ భవనంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ ఇచ్చిన 3జీ ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని, ప్రభుత్వం ట్యాబ్‌లు ఇచ్చే వరకు టీచర్లపై ఒత్తిడి మానుకోవాలన్నారు. అనంతరం ఏఐటీయూలో చేరిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, నెన్నల సమ్మయ్య, ఏఐటీయూ జిల్లా కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, రేగుంట చంద్రశేఖర్, సరస్వతి, రమా, తిరుమల, బొల్లం లక్ష్మీ, దాసరి లక్ష్మీ, విజయ, రాజేశ్వరిలు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

భీమారం/భీమిని: పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని భీమారం, భీమిని మండలాల్లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో బీజేపీ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, భీమారం మండల బీజేపీ అధ్యక్షుడు శంకర్, దుర్గం అశోక్, సురేష్, నాగభూషనం, భీమిని మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కోషాధికారి వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

పూజారుల మధ్య వాగ్వాదం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి పాత పూజారులు, నూతన పూజారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆలయంలో పనిచేస్తున్న ఒక పూజారి, ఒగ్గు పూజారి ఇద్దరు గతేడాది డిసెంబర్‌లో రిటైర్మెంట్ కాగా కొత్త పూజారులు వచ్చే వరకు మీరే పూజలు చేయాలని గ్రామస్తులు తెలిపారు. దీంతో వారు పూజలు చేస్తున్నారు. ఆలయ కమిటీ ఇటీవల నూతనంగా నలుగురు కొత్త పూజారులను నియమించారు. బుధవారం జాతర ప్రారంభం కానుండటంతో పాత పూజారులు పూజలు చేయొద్దని కొత్త పూజారులు అనడంతో వీరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.. ఘర్షణలో పాతపూజారి స్పృహ తప్పిపోవడంతో అతడిని 108ద్వారా చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాత పూజారులు కూడా ఉండాలని గ్రామస్తులు అంటున్నారు. పోలీసులు జోక్యం చేసుకొని వారికి సర్ది చెప్పి, వాగ్వాదాన్ని విరమింపజేశారు.

ఆధ్యాత్మికం

అన్ని సౌకర్యాలు కల్పించాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



అధికారులతో మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని గోదావరి నదికి శివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అధికారులను ఆదేశించారు. గోదావరి నది తీరాన భక్తులు వచ్చే ప్రాంతాల వద్ద మంగళవారం ఏర్పాట్లను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

బెల్లంపల్లిరూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుగ్గ రాజేశ్వరస్వామి జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీసీపీ భాస్కర్ అన్నారు. మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు. జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన వెంట బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య, తదితరులు ఉన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

భీమిని: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కన్నెపల్లి మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

లక్సెట్టిపేటలో సౌకర్యాలు పరిశీలన

లక్సెట్టిపేట: మహా శివరాత్రిని పురస్కరించుకొని స్థానిక గోదావరి వద్ద ఏర్పాట్లను సీఐ నరేందర్, ఎస్సై సతీష్, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోదావరి నదికి పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం చెన్నూర్ గోదావరి తీరాన్ని సందర్శించారు. మహిళా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్, సింగరేణి అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యాగశాల వద్ద నేడు ప్రత్యేక కార్యక్రమాలు

నస్పూర్: మహాశివరాత్రి పురస్కరించుకొని బుధవారం సీసీసీ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అభిషేకములు, ఏకాదశ రుద్ర హోమము, లక్ష పార్థీవ లింగార్చన, కోటి బిల్వార్చన, పుష్పార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం ఉమా మహేశ్వర దివ్య కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వంహిచనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సవ విగ్రహ ప్రతిష్టాపన



నదిలో జలాధివాసం చేస్తున్న వేదపండితులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరాలయంలో దివంగత ప్రధానోపాధ్యాయుడు గాడిపల్లి మధుకర్ స్మారకార్థం శివపార్వతుల ఉత్సవ విగ్రహ ప్రతిష్టాపన మంగళవారం ఘనంగా నిర్వహించారు. శివాలయంలో గణపతి పూజ, పున్యవచనం, అఖండ దీపం కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలతో ప్రాణహిత నదికి వెళ్లి జలాధివాసం, ధాన్యాధివాసం, పలు పుష్పాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు.

శివపార్వతుల ఎదుర్కోలు

మందమర్రిరూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివపార్వతుల కళ్యాణం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మూడో జోన్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు వెంకటాచారి ఆధ్వర్యంలో ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పుణ్యస్నానాలకు రావొద్దు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ముల్కల్ల గోదావరి పుష్కరఘాట్ వద్ద బుధవారం మహాశివరాత్రి సందర్భంగా చేపట్టాల్సిన రక్షణ చర్యలపై మంగళవారం ఉదయం సమీక్షించారు. అధికారులు గోదావరి నీటి ప్రవాహం, లోతు, ఇతర ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని భక్తులు ఎవరూ కూడా పుణ్యస్నానాలకు రావొద్దని తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎస్సై గోపతి సురేశ్ అధికారిక ప్రకటన చేశారు. గోదావరి తీరం అపరిశుభ్రంగా, బురదమయంగా ఉండటంతో పాటు అతితక్కువ దూరంలోనే గోదావరి చాలా లోతుగా ఉన్నట్లు గుర్తించారు. ముల్కల్ల గోదావరి తీరానికి వెళ్లే దారులన్నీ కూడా పూర్తిగా మూసివేసినట్లు తెలియజేశారు.

గోదావరి తీరం పరిశీలన

దండేపల్లి: మండలంలోని గూడెం, ద్వారక గోదావరి నది తీరాలను ఎస్సై తహసీనొద్దీన్ మంగళవారం సందర్శించారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం నదీతీరాల్లో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జీపీ సిబ్బందికి సూచించారు.

జన్నారం: మహాశివరాత్రిని పురస్కరించుకొని గోదావరిలో పుణ్యస్నానం చేయడానికి వచ్చే భక్తులకు సౌకర్యాలపై మంగళవారం తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి గోదావరి తీర ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. బాదంపల్లి, కలమడుగు, తపాలపూర్, రాంపూర్, తిమ్మాపూర్, ధర్మారం గ్రామాల గోదావరి తీర ప్రాంతాలను పరిశీలించి భక్తుల సౌకర్యాలను గ్రామ కార్యదర్శులతో చర్చించారు.